క్లుప్తంగా

క్షయవ్యాధి కట్టడి అందరి బాధ్యత

సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి



న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: క్షయవ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ యూనిట్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు బ్రౌజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ బాస్కెట్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక్కో పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా న్యూట్రిషన్ అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ప్రవీణ్, బ్రౌజ్ ఫౌండేషన్ డాక్టర్ వెంకట్, హెచ్‌ఈఓ సుగుణాకర్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ



మాణయ్య

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఉన్న అంజయ్య ఇటీవల పదవి విరమణ పొందారు. ఆయన స్థానంలో సింగితం ప్రధానోపాధ్యాయుడు మాణయ్యకు ఇన్‌చార్జి ఎంఈఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. శనివారం రాయికోడ్ ఎంఆర్‌సీలో మాణయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రాయికోడ్ ప్రాథమిక, కర్చల్, రాయికోడ్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, నర్సింలు, ఖైరత్ అలీ, ఎంఆర్‌సీ సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, నర్సింలు, సిబ్బంది మోహన్, అనిల్‌కుమార్ ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి



బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ప్రతి నెల విద్యుత్ బిల్లులు చెల్లించాలని లైన్‌మెన్ హరికృష్ణ వినియోగదారులను కోరారు. శనివారం మండలంలోని తాటిపల్లిలో ఇంటింటికి తిరిగి విద్యుత్ బిల్లులు వసూలు చేశారు. తాటిపల్లిలో 790 విద్యుత్ మీటర్లు ఉండగా వారిలో కొంత మంది మాత్రమే బిల్లులు చెల్లించారని లైన్‌మెన్ హరికృష్ణ తెలిపారు. లేట్‌గా కడితే రూ.100 ఫైన్ కట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.


సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చెక్కులు అందజేస్తున్న నగేష్‌షెట్కార్

నారాయణఖేడ్: ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు శనివారం సీఎం సహాయనిధి మంజూరైన రూ.8 లక్షల చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, కంగ్టి పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, మనూరు, కంగ్టి మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్‌రావు, మల్లారెడ్డి, రవి, దత్తురెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యేకు పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ...ఉప్పల్ నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా పని చేయడంతో పాటు.. హైదరాబాద్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి రాజిరెడ్డి అని కొనియాడారు.

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ!

- ప్రత్యేక శిక్షకులతో ట్రైనింగ్
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణకు ఒక సమర్థవంతమైన మార్గం. దీంతో విద్యార్థులకు శారీరక దృఢత్వం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంచుతుంది. కరాటే శిక్షణ ద్వారా విద్యార్థులు తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన మెలకువలు నేర్చుకుంటారు. అపాయకర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో తెలుసుకుంటారు. వేసవిలో ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: ఆత్మరక్షణ, ఆరోగ్యం, దేహదారుఢ్యం, శారీరక దృఢత్వానికి కరాటే దోహదపడుతుంది. సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని భావించి కరాటే నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లల్లో మనోధైర్యం పెరుగుతుందని తల్లిదండ్రులు కూడా ట్రైనింగ్‌కు పంపుతున్నారు. వేసవి సెలవుల కారణంగా శిక్షణ పొందడానికి కేంద్రానికి పిల్లలు వస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలోని తైక్వాండో కరాటే అకాడమి ఆధ్వర్యంలో మాస్టర్ శ్రీకాంత్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నారు. తైక్వాండో ప్రొఫెషనల్ కరాటే మాస్టర్ అంజి పర్యవేక్షణలో కొన్ని సంవత్సరాలుగా పిల్లలకు వేసవిలో శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది ఉచిత శిక్షణ శిబిరం నడుపుతున్నారు. సాధారణ రోజుల్లో కూడా శిక్షణ ఇస్తుండగా వేసవిలో మాత్రం పిల్లలు ఎక్కువ మంది వస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు టోర్నమెంట్‌లో పాల్గొని రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. వేసవితోనే పట్టణంలో ఆదర్శనగర్ కాలనీలో శిక్షణ శిబిరం ప్రారంభమైంది. 3–18 సంవత్సరాల పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉ. 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 50 మందికిపైగా పిల్లలు ట్రైనింగ్‌లో పాల్గొంటున్నారు.



ట్రైనింగ్ ఇస్తున్న మాస్టర్ శ్రీకాంత్

పలు అంశాల్లో శిక్షణ

మాస్టర్ శ్రీకాంత్ కరాటేకు సంబంధించి పలు అంశాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. పంచ్, మూవింగ్, టర్నింగ్ కటాస్, వెపన్ కటాస్, బ్లాక్, డౌన్‌బ్లాక్, అప్పర్ బ్లాక్, యూనిపాస్ బ్లాక్, ఫ్రంట్ కిక్, స్లాప్ కిక్‌లతో పాటు యోగా, ధ్యానం తదితర అంశాల్లో విద్యార్థులకు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా బ్యాచ్‌లుగా విభజించి ప్రాక్టీస్ చేయిస్తున్నారు.

> **ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..**
>
> 
>
> కరాటే నేర్చుకోవడం వల్ల మనోధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మాస్టర్ అంజి పర్యవేక్షణలో కొన్ని సంవత్సరాల నుంచి పట్టణంలోని విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు వందల మంది విద్యార్థులు శిక్షణ పొందారు. వేసవిలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. పిల్లల తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన వస్తుంది. టోర్నమెంట్లు కూడా నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బెల్ట్‌ల ప్రదానం చేస్తున్నాం.
>
> – శ్రీకాంత్, కరాటే మాస్టర్, జహీరాబాద్

మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎంను బర్తరఫ్ చేయాలి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: దేశ ప్రజలు, సైన్యంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ బీజేపీ ఉపముఖ్యమంత్రి జగదీశ్ దేవడాను వెంటనే బర్తరఫ్ చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి గత వారం రక్షణశాఖలో కీలక పాత్ర పోషిస్తున్నా సోఫియా ఖురేషి పాకిస్తాన్ టెరర్రిస్టుల స్థావరాలను అంతం చేయడంతో దేశం మొత్తం గర్వించారు. బీజేపీ మంత్రి మాత్రం ముస్లిం మతానికి చెందిన సోదరితో పాకిస్తాన్‌పై ప్రధాని మోదీ దాడి చేయించారని మతాన్ని అంటగట్టడంపై సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టడం మరువక ముందే మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీష్ దేవడా మాట్లాడుతూ.. పాకిస్తాన్‌పై ప్రధాని మోదీ దాడి చేయించినందుకు దేశం, సైన్యం మొత్తం ప్రధాని మోదీ కాళ్ల మొక్కాలని మాట్లాడడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం అతనిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి, శివనగర్, అండూర్, బొల్లారం గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా సౌకర్యాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మొగిలిమాల, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికున్ గున్యా కేసులు లేవు

డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి



రోగులకు సూచనలు ఇస్తున్న గాయత్రీ దేవి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వంగ్దల్ రూప్ల తండాలో చికున్ గున్యా కేసులు లేవని డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి పేర్కొన్నారు. శనివారం రూప్లతండాను సందర్శించి.. వైద్య శిబిరాన్ని పరిశీలించారు. తండాలో సాధారణ జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. తండాలో శిబిరం కొనసాగిస్తామని చెప్పారు. ఎవరూ భయాందోళన చెందవద్దన్నారు. రోగుల నుంచి సేకరించిన రక్త నమునాల రిపోర్టులు నెగెటివ్‌గా వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి, డాక్టర్ నాగమణి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న మహిపాల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: మున్సిపాలిటీలో పని చేస్తున్న వాటర్ సప్లై కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ ఉమామహేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు. లేని యెడల ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు దత్తు, సంజీవ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాసేందుకు అనుమతి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్

జోగిపేట(అందోల్): నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2016–17 నుంచి 2019–20 బ్యాచ్‌లో 1వ సెమిస్టర్ నుంచి 6వ సెమిస్టర్ వరకు ఫెయిలైన విద్యార్థులకు తిరిగి బ్యాక్‌లాగ్స్ పరీక్షలు రాసుకోవడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుమతి నిచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఒకసారికి మాత్రమే ఉంటుందని చెప్పారు. బీఏలో రెండు పేపర్లకు ప్రతి సెమిస్టర్‌కు రూ.950, మూడు పేపర్లకు ప్రతి సెమిస్టర్‌కు రూ.1690, బికాంలో రెండు పేపర్లకు రూ.1020, మూడు పేపర్లకు రూ.1840, బీఎస్సీలో రెండు పేపర్లకు రూ.1020, మూడు పేపర్లకు రూ.1840 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా మే 19 వరకు, అపరాధ రుసుంతో మే 22 నుంచి 29 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.

20న స్పాట్ కౌన్సిలింగ్

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి మిగిలిన సీట్లకు ఈ నెల 20న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉ.10 గంటల వరకు సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నిమ్స్ ఫలితాల్లో సత్తా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ ఉపకార వేతనాలకు 2025– 26 విద్యాసంవత్సరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 12 మంది విద్యార్థులు 8వ తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి జాతీయస్థాయి ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. స్కాలర్‌షిప్ ఎంపికైన కార్తీక్, నివాస్, అర్చన, అనుశ్రీ, కీర్తి, లితిన్, కల్పన, శృతి, సమూర్త, వర్షిత, చరిత్ర, జాగృతి ఉన్నారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

గుమ్మడిదల ఎస్‌ఐగా భరత్‌భూషణ్



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా భరత్‌భూషణ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బీడీఎల్ భానూర్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మహేశ్వర్ రెడ్డి సంగారెడ్డి సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భరత్ మాట్లాడుతూ.. గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతం కావడంతో అనుక్షణం నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

కంగ్టి ఎస్‌ఐగా దుర్గారెడ్డి



కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండల ఎస్‌ఐగా సిద్ద దుర్గారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహించి కంగ్టి ఎస్‌హెచ్‌ఓగా నియమితులైయ్యారు. కంగ్టిలో పనిచేసిన ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంగారెడ్డి సీఐడీ శాఖకు బదిలీపై వెళ్లారు.

రెండు నెలలకే సీసీ రోడ్డు ధ్వంసం



పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్డు

జిన్నారం (పటాన్‌చెరు): రెండు నెలల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతా లోపాలతో పగుళ్లు ఏర్పడాయని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగారోడ్డు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. దీంతో రెండు నెలలు కాకముందే పగుళ్లు ఏర్పాడ్డాయని స్థానికులు వాపోయారు. అధికారుల తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



సదాశివపేట రూరల్ : స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



నారాయణఖేడ్: వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్ శివారులోని వెంకట చల దివ్యక్షేత్రంలో శనివారం శ్రీవారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ విశిష్టతను వేదపండితులు వివరించారు. స్వామివారి కల్యాణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలోని పాత పేరుమాళ్ల హనుమాన్ మందిరం నుంచి గాంధీచౌక్, ఇశ్రితాబాద్, వెంకటాపూర్ పుర వీధుల్లో గుండా రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: మండల పరిధి హన్మంత్‌రావుపేట్‌లో ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉత్సవాలకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని నల్లవల్లి గ్రామంలో శనివారం నుంచి 20 వరకు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొనాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డిని శనివారం గ్రామస్తులు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, రాజుగౌడ్, హరిబాబు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ బడిలో చేర్పాలి

మునిపల్లి(అందోల్): బడీడు పిల్లలతో పాటు అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుకున్న విద్యార్థులు, పిల్లలు బడిలో చేరాలని ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ బడిలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ప్రత్యేక తరగతుల వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు.

◆ ఘనంగా మల్లన్న స్వామికి పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవెల్లి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు చింటూగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సేవకు గుర్తింపు

జహీరాబాద్ టౌన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ సిబ్బందికి శనివారం ప్రశంసా పత్రాలు, క్యాష్ రివార్డులను ప్రదానం చేశారు. ఇంధన పొదుపు, ఆదాయ పెంపుపై దృష్టి సారించిన వారిని గుర్తించి 12 మంది డ్రైవర్లు, కండక్టర్, మెకానిక్‌లకు ప్రగతి చక్ర పురస్కారాల అవార్డులను డిపో మేనేజర్ జాకీర్ హుసేన్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ గ్యారేజ్ ఇన్‌చార్జి తిరుమలేశ్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ ముగిసిన సప్తాహ



నారాయణఖేడ్: మండల పరిధి బాణాపూర్‌లోని శ్రీరుక్మిణి పాండురంగ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన 22వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం శనివారం ముగిసింది. చివరి రోజున ప్రవచనకారులు ప్రవచనం, హరిపాల్, కీర్తన, మరాఠి, తెలుగులో భజనలు, కాకడహారతి, గాథపూజ, తీర్థ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్ప– కామారతి కల్యాణ మహోత్సవాలు రెండవ రోజు శనివారం కొనసాగాయి. గంగకు పోయే కార్యక్రమంలో భాగంగా భక్తులు గంగవైపు పయనించారు.

◆ శుద్ధిజలం నేలపాలు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా చాలా ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీల వల్ల నీరు వృథాగా పోతుంది. శనివారం ఉదయం మండల పరిధి గంగ్వార్ గ్రామ శివారులో అల్లాదుర్గం–మెటల్‌కుంట రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా శుద్ధి జలం వృథాగా పారుతోంది. అధికారులు దృష్టి సారించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు
- పిల్లర్లకు పగుళ్లు.. తేలిన ఇనుప చువ్వలు
- మరమ్మతులు చేపట్టాలంటున్న ప్రజలు



చర్లగూడెంలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని పలు గ్రామాల్లో ఓఆర్‌హెచ్ ట్యాంకులు శిధిలావస్థకు చేరి ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. గ్రామీణ తాగునీటి సరఫరా పథకంలో భాగంగా 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఓవర్ హెడ్ ట్యాంకులు పాతవి కావడంతో కొన్ని చోట్ల ట్యాంకుల పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల ట్యాంకులకు ప్లాస్టింగ్ ఊడిపోయి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో ట్యాంకులు ఎప్పుడు కూలుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మామిడిపల్లి, ఎర్దనూర్, తునికిళ్ల తండా, చర్లగూడెం, మక్తఅల్లూరు, కాశిపూర్, ఎద్దుమైలారం తదితర గ్రామాల్లో ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ట్యాంకులు కూలి ఏప్రమాదం జరగక ముందే వాటికి మరమ్మతులు చేయించి, అలాగే పూర్తిస్థాయిలో పాడైన ట్యాంకులను కూల్చి వేసి వాటిస్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. శేఖర్ మామిడిపల్లిలో రెండు ట్యాంకులు ఉండగా పాత ట్యాంకు పిల్లర్లకు పగుళ్లు వచ్చాయి. ప్లాస్టింగ్ కూడా ఊడిపోయి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. ఈ ట్యాంకు కూలితే కొత్త ట్యాంకుపై పడే ప్రమాదం ఉంది. పడక ముందే అధికారులు తొలగిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని గ్రామస్తులు అంటున్నారు.

> **అధికారుల అనుమతి కోరాం..**
>
> మండలంలో పలుచోట్ల ఓఆర్‌హెచ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తాం. మామిడిపల్లి, చర్లగూడెం గ్రామాల్లో పూర్తిగా పాడైన ట్యాంకులను కూల్చేందుకు క్వాలిటీ కంట్రోల్ శాఖ అధికారుల అనుమతి కోసం ప్రతిపాదనలు పంపాం.
>
> – ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్